# కొబ్బరి కాయ (టెంకాయ)

దేవాలయములలో కాని, ఇంటిలో కాని ఎంత తెలియనివారైన కొబ్బరికాయలేనిది పూజ చేయరు. కొబ్బరికాయ కొట్టితేనే పూజయను భావము చాలామందికున్నది. టెంకాయను ప్రతిమ ముందర ఎందుకు కొట్టుతారు? అని కొందరిని అడిగితే, టెంకాయను దేవునికి అర్పితము చేసి దానిని మనము ప్రసాదముగా తీసుకోవడానికి ముఖ్యమైనదని తెలిపినారు. టెంకాయ ఎందుకు ముఖ్యమైనది? ఇతర కాయలు ఎందుకు పగులకొట్టకూడదు? అని అడిగితే దానికి సరైన సమాధానము చెప్పక పెద్దలు చేసినట్లు చేయవలయునుకాని వివరించి అడుగకూడదు అని అంటున్నారు. ఇంకను కొంతమందిని కొబ్బరికాయకు పీచు అంతా పెరికి పైన జుట్టు కొంచెము పెట్టుచున్నామే ఆ కొద్దిగా ఎందుకు ఉంచవలయును? అని అడిగితే పూర్వము నుంచి వచ్చే పద్ధతినే చేయవలెను కాని దానిని విమర్శ చేయకూడదన్నారు. వారికి తెలియక అట్లన్నారుగాని టెంకాయలో ఎంతో అర్థము ఉన్నది. ఆ అర్థము తెలుసుకోలేక దానిని పూజా సాధనముగ పెట్టుకొని దేవునితో బేరములు ఆడుచున్నాము. టెంకాయ యొక్క సారాంశము తెలుసుకుంటే భక్తి ఎంతో బాగుండేది. దాని సారాంశము తెలియక కొంతమంది భక్తులు ఒకరు నాలుగు, ఒకరు రెండు, డబ్బున్నవారు ఇంకా ఎక్కువ కొట్టుచున్నారు. ఎక్కువగా టెంకాయలు కొట్టితే భక్తి, లేకపోతే భక్తికాదా? ఏమి లేని బీదవాడు టెంకాయ కొట్టలేకపోతే వానిది భక్తి కాదంటామా? దేవుడు ఒప్పుకోడంటామా? అన్నిటికి ముఖ్యమైనది మనస్సు. ఏది లేక పోయినా మనసుంటే అంతకంటే నాకు ప్రియులులేరని దేవుడు గీతయందు చెప్పి ఉన్నాడు. అయితే టెంకాయ పూజా విధానములో ఎందుకు చోటుచేసుకొన్నది, దాని ప్రత్యేకత ఏమంటే? టెంకాయ కూడ పరమాత్మను తెలుసుకొనుటకు చిహ్నముగ ఉపయోగపడుచున్నది. కావున పూర్వము పెద్దలు టెంకాయను దేవాలయాలలో ఉపయోగించినారు. కొబ్బరికాయతో అజ్ఞానులు జ్ఞానులుగా మారుదురని పెద్దలు ఈ పనిని చేసినారు. కాని కాలక్రమేణ దాని అర్థము పోయినది. దాని అర్థము తెలియజేయువారు పోయినారు. ఈ కాలములో కొబ్బరికాయ మానవులకు దేవునికి మధ్య వ్యాపార వస్తువుగా మారిపోయినది.

టెంకాయచుట్టు ఉన్న పీచునంత తొలగించగా కాయ మూడు భాగములుగా కనిపించుచున్నది. కాయ మీద ఉన్న మూడు సారలు కాయను మూడు భాగములుగ కనుపించునట్లు చేయుచున్నవి. ప్రతి భాగముపైన కన్ను మాదిరి ఒక తగ్గు ఉన్నది. మూడు భాగములకు మూడు కన్నులున్నవి అందువలన టెంకాయకు ముక్కంటని పేరు వచ్చినది. టెంకాయకున్న మూడు భాగములకు పైన జుట్టుగా కొంత పీచు నిలుపుచున్నాము. చివరన ఉండె ఈ జుట్టుకు ప్రత్యేకత ఉన్నది. టెంకాయ జుట్టును పైకి చేసి దానిమీద ఉన్న పెద్దకడుపును (పెద్ద భాగమును) మనకు ఎదురుగా పట్టుకొని చూచిన పెద్ద భాగమునకు రెండు వైపులా రెండు భాగములు ఉండునుకదా, ఆ భాగములపైన కన్నులు (గుంతలు) ఉన్నవి కదా! కుడి వైపు ఉన్న భాగమును సూర్యనాడి అనియు, ఆ భాగమునకు పైన ఉన్న కన్నును ఆ నాడీ కేంద్రమనియు, ఎడమ ప్రక్క ఉన్న భాగము చంద్రనాడి అనియు, ఆ భాగము పైన ఉన్న కన్నును ఆ నాడీ కేంద్రమనియు, రెండు భాగములకు మధ్య పెద్ద భాగమై ఉన్న దానిని బ్రహ్మనాడి అనియు, ఆ భాగముపైన ఉన్న కన్నును ఆ నాడీకేంద్రమనియు తెలుసుకోవలెను. సూర్య, చంద్ర, బ్రహ్మనాడులు ఏకమయినపుడే జ్ఞానముద్భవించును. ఆ తర్వాత జీవుడు దేవుడుగా మారిపోయి చావు, పుట్టుకలు పొందకపోవును. ఈ మూడు నాడులనొక్కటి చేసినవాడు యోగి అని తెలుపుటకు టెంకాయ మీద కూడ మూడు భాగములనుండి ఏకముగ జుట్టు పెట్టబడినది. మూడు నాడులు ఏకము అయినవాడు జన్మలు లేక ఆత్మయందు ఐక్యము చెందును. కావున మూడు భాగముల నుండి ఏకముగా



**కొబ్బరి కాయ**

మారిన జుట్టుకొన భాగము ఆకాశమును చూపుచున్నది. జీవుడు ఏ ఆకారములేని దానియందు ఐక్యమగును. కావున జుట్టుకొన కూడ ఏ ఆకారములేని ఆకాశమును చూపుచున్నది. మూడు నాడులు ఏకము చేసినవాడు జ్ఞానము చివరి భాగమునకు చేరియుండును. కావున టెంకాయ జుట్టుకు కూడ "జ్ఞాన శిఖ" అని పేరు వచ్చినది. జ్ఞానశిఖ అనగా జ్ఞానమునకు చివరి భాగము అని అర్థము. వివేకవంతులయిన బ్రాహ్మణులు వారి తలల మీద జుట్టు నెందుకు పెట్టుచున్నారనగా! జ్ఞానశక్తి నిలువ ఉండు చోటు శరీరమునందు తలయొక్కటే, కావున జ్ఞానశక్తి ఉన్న బ్రాహ్మణులు బాహ్యార్థమై తలలో ఉండు వెంట్రుకలన్నియు తీసి శిఖను మాత్రము ఉంచుచుండిరి. తలయే జీవునకు స్థానము, దానియందే తలంపులు ఉద్భవించుచున్నవి. బ్రహ్మజ్ఞానులు తలంపులను జయించి ఉందురు. కాబట్టి వారు మాయందు ఏ తలంపులు లేవను భావనలో బాహ్యార్థముగా తల మీద వెంట్రుకలు తీసివేయుచున్నారు. అట్లే టెంకాయకు కూడ చుట్టు ఉన్న పీచు పెరుకబడుచున్నది. తలలోనే బ్రహ్మనాడి యొక్క ఏడవ కేంద్రము ఉన్నది కదా! దాని ద్వారానే జీవుడు బ్రహ్మమందు ఐక్యము కావలెను. బ్రహ్మనాడి శరీర మధ్యభాగమున ఉన్నది. తల మీద కూడ దాని స్థానము మధ్యనే ఉన్నది. కావున జ్ఞానశక్తి ఉన్నవారు తమతల మీద మధ్య భాగములో జ్ఞానశిఖ అను పేరుతో కొన్ని వెంట్రుకలు విడిచి వేయుచున్నారు. అట్లే టెంకాయకు కూడ పైన జుట్టు విడుచుచున్నారు. పూర్వము ఈ విధముగా చేయుచుండిరి. కాలక్రమమున జుట్టును ఎక్కడ పెట్టవలెనని తెలియక, ఎవరు పెట్టుకోవలెనని తెలియక, ఎందుకు పెట్టుకోవలెనని తెలియక చాలామంది పొరపడుచున్నారు. బ్రహ్మజ్ఞానియైన ఈశ్వరుడు తన తల మీద ఉన్న వెంట్రుకలను విచ్చలవిడిగా లేకుండ జ్ఞానశిఖగా ముడివేసినాడు. ఆ ముడి ఈశ్వరుని తల మధ్య భాగమున ఉన్నది. అట్లే ఎందరో మహర్షులు కూడ జ్ఞానశిఖను తలమీద మధ్య భాగమున ఉంచినారు. ఇట్లు ఎందరో జ్ఞానులు తమ సూర్య, చంద్రనాడులను బ్రహ్మనాడియందు ఐక్యము చేసి దాని బాహ్యార్థము తలలమీద బ్రహ్మ స్థానమయిన మధ్య భాగమున వారి వెంట్రుకలను ముడి వేసినారు. బ్రహ్మ స్థానము చిన్న పిల్లల తలమీద ప్రత్యక్షముగ చూడవచ్చును. ఒక సంవత్సరము లోపల పిల్లల తల మధ్య భాగమున

బ్రహ్మనాడి స్పర్శను చూడవచ్చును. ఆ భాగముననే జ్ఞానశిఖను జ్ఞానులు వేయుచుందురు. జ్ఞానశిఖ ఈ కాలములో చాలామందికి తల మధ్య భాగమున లేక కొంచెము వెనుకకు పోయి ఉన్నది. బయట జ్ఞానశిఖ ఎక్కడున్నను పరవాలేదు. మనకు లోపల ముఖ్యమైన జ్ఞానమున్న చాలు. టెంకాయను పరిశీలించితే ఎంత అర్థముందో చూడండి. టెంకాయను జ్ఞాన స్వరూపమైన విషయముగా భావించవలెను.

అగ్ని నుండి చిన్న చిన్న అగ్ని రవ్వలు బయల్పడినట్లు, పరమాత్మ నుంచి జీవుడు బయల్పడినాడు. ఒకే అంశ అయినప్పటికి జీవుడు దేవుడనివేరైనారు. ఈ విధముగానే ఆత్మ స్వరూపమైన టెంకాయను కొట్టగా రెండు చిప్పలుగా పగిలి పోవుచున్నది. అందులోనొక చిప్పకు జ్ఞానశిఖ మిగిలి పోవుచున్నది. రెండవచిప్పకు ఏమీ మిగలక పోవుచున్నది. జ్ఞానశిఖ మిగిలిన చిప్ప ఆత్మగాను, జ్ఞానశిఖ లేకుండ మూడు భాగములుగానే మిగిలియున్న రెండవ చిప్ప జీవాత్మగాను పరిగణింప బడుచున్నవి. టెంకాయను రెండు చిప్పలుగా దేవుని ముందు పగులగొట్టి ఒకే పరమాత్మ అంశనుండి నీవు నేను వేరైనామను బాహ్యార్థముగా చూపుచున్నాము. ఈ విధమైన భావముతో పూర్వము జ్ఞానులు చేయుచుండిరి. ఇపుడు కొంత మంది ఏ భావము లేకున్న కోరికలు మాత్రము చాలా పెట్టుకొని టెంకాయలు చాలా కొట్టుచున్నారు. టెంకాయను కొట్టువారందరు దాని యొక్క ప్రాముఖ్యతను తెలుసుకుంటే ఎంతో శ్రేయస్కరముగా ఉండును.

టెంకాయను పగులకొట్టగా రెండు భాగములగుచున్నవి కదా! ఆ రెండు చిప్పల లోపలి భాగమున తెల్లని రంగు కల్గి ఏ కల్మషము లేక ఉండును. దాని అర్థమేమనగ నీవు దేవునివి, నేను జీవున్ని, నీవు ఏ గుణములు లేక నిష్కల్మషముగా ఉన్నావు. నేనునూ నీ మాదిరే ఏ కోర్కెలు ఏ తలంపులు లేక నిష్కల్మషముగా మారి ఉన్నానని, బాహ్యార్థముగా తెలియచేయుటకై రెండు చిప్పలు తెల్లగా ఉన్నవి. ఈ విధముగ జ్ఞానులు టెంకాయలు పగులకొట్టి బాహ్యార్థముగా చూపించినారు. మరియు రెండుగ మారిన నీవు నేను ఏకము కావలెనని బాహ్యార్థముగానే రెండు చేతులు కలిపి చూపించారు దానినే మనము నమస్కారము అనుచున్నాము. ఎడమ హస్తము ఆత్మ అనియు, కుడి హస్తము జీవాత్మ అనియు ఆ రెండు హస్తములు జోడించడము జీవాత్మ ఆత్మలు ఐక్యము చేయడమనియు తెలుసుకోవలెను. పూర్వము తెలిసినవారు నోటితో నేమి మాట్లాడక వారిలోయున్న భావమును టెంకాయ ద్వారా నమస్కారము ద్వారా బాహ్యార్థముగా దేవునికి తెలియజేయుచుండిరి. ఈ కాలములో అనేక విధ కోర్కెలతో పవిత్రమైన టెంకాయలను అపవిత్రము చేయుచున్నారు. రెండు చేతులు జోడించి చూపడములో జీవాత్మ ఆత్మ ఐక్యార్థము ఉందని తెలియక చేతులు జోడించి నిలబడి అనేకములైన కోర్కెలు కోరదగినవి, కోరరానివి కోరుచున్నారు.

టెంకాయకు ఉన్న కన్నులలో ఒక కన్నుకు మాత్రము రంధ్రముపడును. మిగతా వాటికి ఎందుకు పడడము లేదు? మరియు దానిలోని నీళ్లను అందరు తీర్థముగా పుచ్చుకొనుచున్నారు. దాని ఫలితము ఏమై ఉండును? అనియు కొంతమందికి అనుమానము రావచ్చును. దానికి నా సమాధానము జీవుడు పరమాత్మను చేరవలయునంటే తన మధ్యన ఉన్న బ్రహ్మనాడియందే ఐక్యము కావలెను. కావున టెంకాయ కన్నులందు కూడ బ్రహ్మనాడి అనిపించుకొన్న పెద్ద భాగముపైన ఉన్న కన్నే రంధ్రముపడును. మిగత నాడులయందున్నపుడు మరణించిన జీవుడు ఆత్మను చేరలేడు. కావున టెంకాయ మిగతాకన్నులు గట్టిగా ఉండి రంధ్రములుపడవు. మనము చేసిన పూజ యొక్క ఫలితము టెంకాయలోని నీటిని ఆవహించి ఉండును. కావున దానిని తీర్థముగా పుచ్చుకొనుచున్నారు. ఎవరు ఎంత భావముతో పూజ చేసి ఉందురో, అంత శక్తియేవారు తీసుకొన్న

తీర్థమందు ఉండును. కావున భావములేని పూజ వ్యర్థము. దీని వలన తీర్థమనగా శక్తితో కూడుకొని ఉన్నదని తెలియుచున్నది. పూజా విధాన భావము తెలియక దానిలోని భక్తిని అనుసరించక చేసిన పూజయితే తీర్థము కూడ శక్తిలేనిదగును.

టెంకాయను కొట్టునపుడు జుట్టును క్రిందివైపుగా పట్టుకొని చాలా మంది కొట్టుచున్నారు. అట్లు కొట్టుట సరియైన పద్ధతికాదు. టెంకాయను కొట్టునపుడు జుట్టును పైకి ఉంచి చూపికొట్టవలెను. ఈ విధముగా కొట్టగా కుడిచేతియందు క్రింద చిప్ప మిగులును. జుట్టు ఉన్న చిప్ప ఎడమ చేతియందు మిగులును. తిరిగి కుడి ఎడమ చేతులు కలిపి చూపించడమే నన్ను నీలోనికి చేర్చుకొమ్మను భావము. ఈ విధముగా సరైన భావముతో పూజ చేసిన ఆ పూజయందు జ్ఞానశక్తి లభించును. జ్ఞానము వలన ముమ్ముందులో సరైన మార్గములను తెలుసుకొని యోగసాధనలు చేసి దేవునియందు ఐక్యము కావచ్చును. ఆ విధముగాకాక భావము లేని పూజ వ్యర్థము. టెంకాయకు పెట్టిన డబ్బులు కూడ వ్యర్థమే. టెంకాయలోను, గంటలోను, నమస్కారములోను ఎంతో అర్థము ఉన్నది. దానిని తెలుసుకోజాలక ఇతరులు చేస్తూ ఉంటే మేము చేస్తున్నామంటే ఏ ప్రయోజనము ఉండదు.

బ్రహ్మవిద్యయందు ప్రవేశమున్నవారు టెంకాయను గురించి చెప్పుచుండుట విన్నాము. అందువారు టెంకాయను మూడు భాగములను మూడు గుణములుగా భావించి చెప్పుచున్నారు. మూడు గుణముల జయించక ఇంకా కొద్దిగా గుణములు ఉన్నవారు టెంకాయకు కూడ జుట్టు కొద్దిగా పెట్టుచున్నారు. మరియు వారు కూడ తమ తలల మీద కొద్దిగా జుట్టు ఉంచుకొనుచున్నారు. పూర్తి గుణములు జయించి గుణాతీతులై ఉన్నవారు జుట్టును ఏ మాత్రము పెట్టుకోక తీసివేయు చున్నారు. వారు టెంకాయకు కూడ జుట్టు పెట్టకుండ అంతయు పెరికి కొట్టుచుందురు అని తెలిపి ఉన్నారు. ఆ మార్గముగా టెంకాయను భావించిన ఆ భావములో అనేక సంశయములు బయలుదేరును. ఎంత వెదకిన ఆ సంశయములకు సమాధానములు దొరకుటలేదు. కావున ఆత్మయే ఊహకందించి తెలిపిన దానిని నేను తెలుపుచున్నాను. ఈ మార్గమున పోయిన ఒక్క సంశయము కూడ బయలుదేరదు. ఒకవేళ బయలుదేరిన అందులకు సమాధానము వెంటనే లభించును.